

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, చిత్రంలో మోకు దెబ్బ నాయకులు

# గౌడ కులస్తుల సంక్షేమానికి కృషి

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 30 : గౌడ కులస్తుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తున్నదని రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. నిర్మల్‌లోని ఆర్కే కన్వెన్షన్‌లో 3వ తేదీన జరిగే మోకు దెబ్బ గౌడ జన హక్కుల పోరాట సమితి రాష్ట్ర మూడో మహా సభ పోస్టర్లను అంబేద్కర్ సచివాలయంలోని తన చాంబర్‌లో శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గౌడ కులస్తుల రక్షణ కోసం కృషి చేస్తూ వారి సమస్యలను పరిష్కరిస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్, జాతీయ సెక్రటరీ జనరల్ రాగుల సిద్ధి రాములు, జాతీయ కోశాధికారి బాలేశం గౌడ్, రాష్ట్ర నాయకులు సంజీవ్ గౌడ్, యాదవ సంఘం నాయకులు శ్రీకాంత్ యాదవ్ పాల్గొన్నారు.



మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డితో పొన్కల్ మండల వాసులు

# మంత్రికి 'పొన్కల్'వాసుల కృతజ్ఞతలు

మామడ, సెప్టెంబర్ 30 : మామడ మండలంలోని పొన్కల్ గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై నూతన మండలవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని అంబేద్కర్ సచివాలయంలో శనివారం మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి పొన్కల్ మండల పరిధిలోని పది గ్రామాల నాయకులు, ప్రజలు మర్యాదపూర్వకంగా కలిశారు. మండల ఏర్పాటుకు కృషిచేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ రాంకిషన్‌రెడ్డి, జేఏసీ కన్వీనర్ కొరిపెల్లి సుధాకర్‌రెడ్డి, సర్పంచ్‌లు పస్పుల భూమేశ్వర్, రావుల ముత్యంరెడ్డి, పీ లక్ష్మీనారాయణ, రైతు బంధు సమితి మండల కన్వీనర్ కాలగిరి గంగారెడ్డి, బీఆర్ఎస్ మండల కన్వీనర్ పాకాల చంద్రశేఖర్‌గౌడ్, నాయకులు నల్ల లింగారెడ్డి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల్ జిల్లాకు కేటీఆర్

- ఈనెల 4వ తేదీన పర్యటన
- రూ.1,157 కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు
- పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలి
- మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 30 : బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ఈ నెల 4వ తేదీన నిర్మల్ జిల్లాలో పర్యటించనున్నారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలో నిర్మల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నట్లు మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ మేరకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల అనంతరం పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో మధ్యాహ్నం భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు.

**రూ.1,157 కోట్లతో అభివృద్ధి పనులు..**

జిల్లా పర్యటనలో భాగంగా ఈ నెల 4న మంత్రి కేటీఆర్ రూ.1157 కోట్లతో పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేయనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా రూ.714 కోట్లతో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఎత్తిపోతల పథకాన్ని (27వ ప్యాకేజ్) ప్రారంభించనున్నారు. మిషన్ భగీరథలో భాగంగా రూ.23.91 కోట్లతో ఇంటింటా నల్లా నీటి సరఫరా ప్రారంభిస్తారు. సోన్ మండలం పాత పోచంపాడ్‌లో 40 ఎకరాల విస్తీర్ణంలో రూ.250 కోట్లతో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. నిర్మల్ పట్టణంలోని తహసీల్ కార్యాలయ స్థలంలో 2 ఎకరాల 30 గుంటల్లో రూ.10.15 కోట్లతో అధునాతన హంగులతో నిర్మించనున్న సమీకృత మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. రూ.2 కోట్లతో టీయూఎఫ్ఐడీసీ నిధులతో నిర్మించే దోబీఘాట్ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. రూ.4 కోట్లతో టీయూఎఫ్ఐడీసీ నిధులతో మౌలిక సదుపాయాల కల్పన కోసం చేపట్టే అభివృద్ధి పనులకు శంకుస్థాపన, అమృత్ పథకంలో భాగంగా మంచినీటి సరఫరా వ్యవస్థను మెరుగుపర్చేందుకు రూ.62.50 కోట్లతో శంకుస్థాపన, రూ.50 కోట్లతో టూయూఎఫ్ఐడీసీ అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రత్యేక అభివృద్ధి నిధులతో రూ.25 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా చేపట్టే అభివృద్ధి పనులకు శంకుస్థాన చేస్తారు.

# ఆశీర్వదించండి.. అండగా ఉంటా

- మళ్లీ బీఆర్ఎస్‌దే అధికారం
- బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్
- మచ్చాపూర్, కొలాంగూడ, కొద్దుగూడల్లో ఆత్మీయ సమ్మేళనాలు
- బీజేపీ నుంచి 50 మంది యువకుల చేరిక



బీఆర్ఎస్‌లో చేరిన యువకులతో పార్టీ బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్

గుడిహత్నూర్, సెప్టెంబర్ 30 : 'సమస్యలు తెలిసిన వాడిని.., కారు గుర్తుకు ఓటేసి ఆశీర్వదించండి అండగా ఉంటా..' అని బీఆర్ఎస్ పార్టీ బోథ్ నియోజకవర్గ అభ్యర్థి అనిల్ జాదవ్ ప్రజలను కోరారు. మండలంలోని మచ్చాపూర్, కొలాంగూడ, కొద్దుగూడ గ్రామాల్లో శనివారం ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొనగా, ప్రతీ గ్రామంలో ప్రజలు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో కాలినడకన తిరుగుతూ ప్రచారం చేశారు. అనంతరం ఆయన సమక్షంలో 50 మంది బీజేపీ యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయా సమావేశాలోల అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని పథకాలు మన రాష్ట్రంలో కేసీఆర్ సర్కారు అమలు చేస్తున్నదన్నారు. అన్ని రకాల అభివృద్ధి పనులు చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వమే మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఓట్ల కోసం సాధ్యం కాని పథకాలపై హామీలు ఇస్తున్న కాంగ్రెస్, బీజేపీల మాటలు నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. ప్రజల సమస్యలు తెలిసిన సీఎం కేసీఆర్‌ను మరోసారి సీఎంగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంగీత ఆడె, సర్పంచుల సంఘం అధ్యక్షుడు జీ తిరుమల్‌గౌడ్, గ్రామ పటేళ్లు జంగు, కోవ ప్రభాకర్, ఎంపీటీసీ శగీర్‌ఖాన్, ఉప సర్పంచ్ తులసీరాం, మంతు, మాధవ్ పటేల్, సిద్ధార్థ్ ససానే, ఎండీ గఫార్, మాజీ సర్పంచులు రవీందర్, ప్రతాప్, నాయకులు ఆడె గుణవంత్‌రావ్, శ్యామ్‌రావ్, రమేశ్ జాదవ్, భీంరావ్, దేవన్న, జాదవ్ రాంజీ, తెలంగే మాధవ్, రావణ్, ఇమ్రాన్‌ఖాన్, నిఖిల్, దోమకొండ సుధాకర్, వివిధ గ్రామాల నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కుపై అవగాహన కల్పించాలి

- నిర్మల్ కలెక్టర్ వరుణ్‌రెడ్డి
- ఓటు వినియోగంపై అవగాహన పాట సీడీ ఆవిష్కరణ




ఓటు వినియోగంపై అవగాహన పాట సీడీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి

నిర్మల్ టౌన్, సెప్టెంబర్ 30 : ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటుకు ఉన్న ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించేలా విస్తృత అవగాహన కల్పించాలని నిర్మల్ కలెక్టర్ వరుణ్‌రెడ్డి అధికారులకు సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో శనివారం ఓటు వినియోగంపై అవగాహన పాట సీడీని ఆయన ఆవిష్కరించారు. జిల్లాలో 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఓటరు నమోదు కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవావలని పిలుపునిచ్చారు. సమాచారశాఖ అన్ని గ్రామాలు, పట్టణాల్లో విస్తృతంగా ప్రచారం చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్వో తిరుమల, కలెక్టరేట్ ఎన్నికల సెల్ నిర్వాహకులు ఫారూఖ్, శ్రీనివాస్, కళాకారులు సుదర్శన్, నాగారాజు తదితరులు పాల్గొన్నారు.

# విజ్ఞానం కోసమే గ్రంథాలయాలు



న్యూవెల్మల్‌లో గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న ఐడీసీ చైర్మన్ వేణుగోపాలా చారి, ఎర్రవోతు రాజేందర్

సోన్, సెప్టెంబర్ 30 : విజ్ఞానాన్ని పెంపొందించేందుకే గ్రంథాలయాలు ఏర్పాటు చేస్తున్నామని ఐడీసీ చైర్మన్ డాక్టర్ వేణుగోపాలా చారి, గ్రంథాలయ చైర్మన్ ఎర్రవోతు రాజేందర్ అన్నారు. శనివారం సోన్ మండలం న్యూవెల్మల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో గ్రంథాలయాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యార్థులు, నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు అందుబాటులో ఉంటాయన్నారు. జడ్పీటీసీ జీవన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కృష్ణప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ అంకం గంగామణి శ్రీనివాస్, ఉపసర్పంచ్ గడ్డం స్వామి, దాసరి రాజేశ్వర్, ఎంపీటీసీ నాగయ్య, ప్రధానోపాధ్యాయుడు విద్యాసాగర్, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

**మళ్లీ కేసీఆర్ సర్కారే**

భైంసా, సెప్టెంబర్ 30 : రాష్ట్రం ఏర్పాటయ్యాక ఎంతో అభివృద్ధి చేశారని, మళ్లీ అధికారంలోకి కేసీఆర్ సర్కారే వస్తుందని వేణుగోపాలా చారి అన్నారు. పట్టణంలోని మార్కెట్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లోకేశ్వరం మండలం కనకాపూర్ లిఫ్ట్ ఇగిరేషన్‌కు రూ.కోటి 80 లక్షలు పునరుద్ధరణ పనులకు మంజూరయ్యాయన్నారు. గడ్చాందలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌కు రూ. 67 లక్షలు, బాసర ఎలక్ట్రికల్ స్కీమ్‌కు రూ. 20.56 లక్షలు మంజూరయ్యాయన్నారు. అంతేగాకుండా కాంగ్రెస్ పార్టీని నమ్మితే మిగిలేది అంధకారమేనన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేశ్ బాబు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సాంప్లీ రమేశ్, పండిత్ రావు, నాయకులు పాల్గొన్నారు.

# వైద్య కళాశాల డిప్యూటీ సూపరింటెండెంట్‌గా సునీల్



బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ సునీల్

నిర్మల్ చైన్‌గేట్, సెప్టెంబర్ 30 : నూతనంగా ఏర్పాటైన నిర్మల్ వైద్య కళాశాలకు డిప్యూటీ సూపరింటెండెంట్‌గా డాక్టర్ సునీల్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా ప్రధాన దవాఖా సూపరింటెండెంట్ దేవేందర్‌రెడ్డి నుంచి బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా దవాఖాన సిబ్బంది, ప్రొఫెసర్లు ఆయనను ఘనంగా సన్మానించారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ జీవీడీఎస్ ప్రసాద్, దేవేందర్‌రెడ్డిని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సునిల్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, వైద్య సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.